## రామ్ గోపాల్ వర్మకు హైకోర్టులో ఎదురుదెబ్బ.!

హైదరాబాద్,టాలీవుడ్ వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ వర్మ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది.గత వారం రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పోలీస్ స్టేషన్‌లో ఐటీ చట్టం కింద వర్మపై కేసు నమోదు చేశారు పోలీసులు. వ్యూహం సినిమా సమయంలో టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, నారా బ్రాహ్మణిలను కించపరిచేలా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టినందుకు గాను మద్దిపాడు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం ఈ కేసును పెట్టాడు. ఇక రామలింగం ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.అయితే ఈ కేసుపై విచారణకు హాజరుకావాల్సిందిగా.. ఏపీ పోలీసులు వర్మకు నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసుల ప్రకారం మంగళవారం వర్మ కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. అయితే అంతకంటే ముందే వర్మ ఏపీ హైకోర్ట్‌ను ఆశ్రయించి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :231 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: మంగళవారం 19-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## బాధితులకు ఉరిశిక్ష పడుతుందని సీఎం సోదరుడు బెదిరిస్తున్నాడు..



హైదరాబాద్,సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతున్న వారి జీవనాధారాన్ని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచకంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలోతు కవితతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.గత 9 నెలలుగా తమ భూములు ఇవ్వమని లగచర్ల రైతులు చెబుతూనే ఉన్నారని సత్యవతి రాథోడ్ అన్నారు. భూములు తీసుకుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారని చెప్పారు. దాన్ని సాకుగా చూపి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అర్ధరాత్రి కరెంట్ తీసేసి, ఇంటర్ నెట్ బంద్ చేసి మహిళలను హింసించారని.. కొట్టారని.. బూతులు తిట్టారని అన్నారు. 51 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని.. ఊళ్లో ఉన్న మగవాళ్లంతా పారిపోయారని చెప్పారు. మళ్లీ ఏం చేస్తారోనని ఇప్పటికీ భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ధర్మ పోరాటానికి అండగా ఉండాలని రైతులు అన్ని పార్టీల నాయకులను కోరారని సత్యవతి రాథోడ్ తెలిపారు. బీఆర్ఎస్ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికీ కూడా పోలీసులు గ్రామంలోకి వచ్చి ఇంకా అరెస్ట్ లు చేస్తున్నారని పేర్కొన్నారు.బాధితులకు ఉరి శిక్ష పడుతుందని రేవంత్ రెడ్డి సోదరుడు బెదిరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ భూములు గుంజుకుంటామని చెబుతున్నాడని మండిపడ్డారు. ఢిల్లీలో మాత్రమే న్యాయం జరుగుతుందని భావించి ఇక్కడకు వచ్చామని తెలిపారు. జాతీయ మానవహక్కుల కమిషన్ ను కలిసి పోలీసులు చేసిన అఘాయిత్యాలపై వివరించామని స్పష్టం చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ, మహిళ కమిషన్ ను కూడా కలుస్తామని వెల్లడించారు. న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని అన్నారు.. రాష్ట్రపతి కూడా ఆదివాసీ బిడ్డే అని.. ఆమె మాకు సమయం ఇస్తే వారికి కూడా ఈ సంఘటనను వివరిస్తాని తెలిపారు. కొద్ది రోజులుగా బాధితుల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని అన్నారు. లగచర్ల బాధితులందరికీ బీఆర్ఎస్ పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు.

### మా గిరిజనుల భూముల జోలికి రావద్దు : మాలోతు కవిత

తండ్రుల వారసత్వంగా వచ్చిన భూములను ఫార్మా కంపెనీ ఇవ్వాలని అంటున్నారని మాలోతు కవిత అన్నారు. ఫార్మా సిటీ కోసం గత ప్రభుత్వం ఇప్పటికే భూములు సేకరించిందని.. దాన్ని కాదని గిరిజనుల భూములను రేవంత్ రెడ్డి లాక్కుంటున్నాడని మండిపడ్డారు. కానీ లగచర్లలో మా తండా వాసులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 90 శాతం లంబాడాలు మద్దతు ఇస్తేనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. కానీ మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. మా గిరిజనుల భూముల జోలికి రావద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులకు గిరిజన బిడ్డలందరం అండగా ఉంటామని చెప్పారు.

## హైడ్రా అడుగులతో అమీన్పూర్ విలవిల..

పటాన్ చేరు, నవంబర్ 18:అమీన్ పూర్ వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణంపై కొరడా ఝుళిపించింది. రోడ్డును ఆక్రమించి నిర్మించిన భవనాన్ని కూల్చివేశారు. అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీలో సర్వేనెంబర్ 848లో రోడ్డుని ఆక్రమించి ఓ వ్యక్తి ఆక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతో కాలనీ సొసైటీ వాసులు హైడ్రాలో ఫిర్యాదు చేయడంతో సోమవారం తెల్లవారుజామున అధికారులు అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు.వందనపురి కాలనీవాసులు ఎన్నిసార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో పట్టించుకోని అధికారులు ,నేరుగా వెళ్లి హైడ్రా ఆఫీస్ లో ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు పూర్తిగా కబ్జా చేసిన నిర్మాణాన్ని నేలమట్టం చేశారు.ఇక ఈ కట్టడానికి నోటీస్ ఇచ్చినప్పటికీ ఇళ్లను తొలగించకపోవడంతో హైడ్రా సీరియస్ అయింది. భారీ యంత్రాలతో అక్రమ నిర్మాణాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేశారు

### వందనపురి కాలనీలో హైడ్రా చర్యలు..

అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈరోజు హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో మరో రెండు చోట్ల అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఇటీవల నాగారం మున్సిపాలిటీలో రోడ్డును ఆక్రమించి



నిర్మించిన ఇళ్లను కూల్చివేశారు. ముందుగానే హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి 15 రోజులు గడువు ఇస్తున్నారు. రెండు వారాల్లో నిర్మాణాలను యజమానులే ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా రంగంలోకి దిగనుంది. ఎక్కడ అయినా ప్రభుత్వ భూములను, చెరువులు కుంటలు ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు మరోమారు హెచ్చరించారు.

## ఫార్మా కంపెనీపై ఎందుకంత ప్రేమ..



హైదరాబాద్,కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా కంపెనీకి స్థలం ఇవ్వని గ్రామస్తులపై దాడి ఘటనను బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. ఫార్మా కంపెనీలపై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమ అని ప్రశ్నించారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న 16 మంది లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ ములాఖత్ అయ్యారు. అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ.. ఓటేసి గెలిపించిన జనాల కంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని నిలదీశారు.లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని రైతులు 8 నెలలుగా ఆందోళన చేస్తున్నారని ఎంపీ డీకే అరుణ అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని పేర్కొన్నారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే కలెక్టర్ ఒక్కరే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. పోలీసుల వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని డీకే అరుణ అన్నారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను భయపెట్టారని తెలిపారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని పేర్కొన్నారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వాళ్లను వదిలేసి మిగతా వాళ్లను అరెస్ట్ చేశారని అన్నారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వాళ్లను కలిసి మాట్లాడితే బాగుండేదని అన్నారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేపించి ఇలా చేయడం కరెక్టు కాదని స్పష్టం చేశారు.సీఎం సోదరుడు అక్కడికి వెళ్ళవచ్చు కానీ నన్ను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని డీకే అరుణ ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని తెలిపారు. మీరు సీఎం అయితే మా నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరు జనాలపై కక్ష కట్టారన్నారు. సీఎంకు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని నిలదీశారు. ఓటేసి గెలిపించిన జనాల కాంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.సీఎం కొడంగల్ వాసులు కాదు వలస వచ్చారని డీకే అరుణ తెలిపారు. మీకు నచ్చిన వారికి కంపెనీలు అప్పజెప్పడానికే ఫార్మా కంపెనీలు పెడుతున్నారని మండిపడ్డారు. వెంటనే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంథాలు వద్దని.. నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని అన్నారు. గర్భిణీ స్త్రీ అని చూడకుండా ఇలా చేయడం దారుణమని అన్నారు. సీఎం రేవంత్ అహంకారం వీడాలని.. ఒప్పించి భూములు తీసుకోవాలని సూచించారు.

## వాహన వినియోగదారులకు శుభవార్త

హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మకనిర్ణయం తీసుకుంది. ఇవి వాహనాలను ప్రోత్సహించడం ..తద్వారా కాలుష్యానికి కళ్లెం వేయడం వంటి బృహత్తర నిర్ణయం ప్రకటించింది. దీంతో వాహన కొనుగోలుదారుకలు కూడా భారీ ఊరట దక్కనుంది. అలాగే కాలుష్యం కూడా తగ్గనుంది. ఢిల్లీలోఅనుసరిస్తున్న ఈ విధానంతో మనకు మేలు జరుగనుంది. ఎలక్ట్రిక్ వెహికిల్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ పాలసీ 2020-2030 పేరుతో కాలుష్య నియంత్రణ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ప్రమాదాల నివారణ, కాలుష్య నియంత్రణకు ఈ విధానం తెచ్చింది. జీవో నెంబర్ 41 ద్వారా తీసుకొచ్చే ఈ విధానం 2026 వరకు అమల్లో ఉంటుంది. తెలంగాణను కాలుష్యరహితంగా మార్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి భారీగా రాయితీలు ఇస్తోంది. తెలంగాణలో విద్యుత్‌తో నడిచే టూ వీలర్స్, ఆటో, ట్రాన్స్పోర్ట్, బస్సులకు వంద శాతం పన్ను రాయితీ ఇవ్వనున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రద్దుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం కూడా విద్యుత్ వాహనాలను రోడ్లపైకి భారీగా తీసుకురానుంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో దాదాపు 3 వేలకుపైగా ఈవీలను ప్రవేశపెట్టనుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ ద్వారా కాలుష్యం తగ్గడమే కాకుండా వినియోగదారుల డబ్బులు కూడా ఆదా అవుతాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కొత్తగా తీసుకొచ్చిన ఈ ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 31 డిసెంబర్ 2026 వరకు అమలులో ఉంటుంది. రాష్ట్రంలో 15 సంవత్సరాల దాటిన వాహనాలు స్క్రాప్ చేయాలని చెప్పామని అందుకు తగ్గట్టుగానే జిల్లాల్లో ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలం చెల్లిన వాహనాలతో కాలుష్య మాత్రమే కాకుండా ప్రమాదాలు పెరిగి పోతున్నాయి. ఇలాంటివి తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 12 లక్షలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 75 శాతం టూ వీలర్స్ ఉన్నాయని తెలిపారు. వాటిని కచ్చితంగా స్క్రీప్ చేయాల్సిందేనన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పాలసీతో అనేక ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. గతంలో ఉన్న నియంత్రణలు ఎత్తేయడంతో ప్రజలు కూడా ఈవీలను కొనేందుకు ముందుకు వస్తారని భావిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజులు, రోడ్డు టాక్స్, రెట్రో ఫిట్మెంట్ ఇన్సెంటివ్‌లు కూడా ఇవ్వబోతోంది. టూ వీలర్లు నుంచి 4 వీలర్లు, కమర్షియల్ వెహికల్స్, టాక్సీలు, టూరిస్టు క్యాబ్‌లు, సొంత కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, బస్సులు వంటి దాదాపు పది రకాల వాహనాలకు 100శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేన్ ఫీజు, లైఫ్ ట్యాక్స్ పూర్తిగా మినహాయింపు ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం రూ. 469కోట్ల వరకు



వినియోగదారులకు పన్ను మినహాయింపులు లభించింది. ఇందులో అందులో రూ.300 కోట్లు ఈవీలదే. దీన్ని మరింతగా ప్రోత్సహించేందుకు పది రకాల వాహనాలకు పన్ను రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో పెరిగిన ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు అనుగుణంగానే ఛార్జింగ్ పాయింట్స్ కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. వాహన సారథిలో తెలంగాణ చేరుతుందన్నారు. వాహనదారులు పొల్యూషన్ టెస్ట్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్న ఆయన... లైసెన్స్ రోడ్ సేఫ్టీపై ఇచ్చే ముందే అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు.

### జగనన్న కాలనీలో విచారణ చేయాలి

అమరావతి,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. అయితే సభలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు సీరియస్ కామెంట్స్ చేశారు. జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. అధికారుల నివేదికలకు వాస్తవ పరిస్థితులకు చాలా తేడా ఉందని అన్నారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించారు. ఒక అధికారిపై చర్యలు చేపడితే మిగిలిన అధికారులు ఇలా చేయరని.. అధికారులు ఇలాంటి పద్ధతులు వెంటనే మానుకోవాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు హెచ్చరించారు. జగనన్న హౌసింగ్ ఇళ్లల్లో పూర్తి విచారణ చేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారని మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు.జగనన్న కాలనీల్లో డిపార్ట్‌మెంట్..విజిలెన్స్ విచారణ కొనసాగుతుందని చెప్పారు. అవసరమైతే సభ్యులు సూచనలు ఇస్తే కాంట్రాక్టర్లను మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.

## రేషన్ ధాన్యంలో 28 శాతం పేదలకు చేరడం లేదు..

హైదరాబాద్,ప్రభుత్వం పంపుతున్న ఆహార ధాన్యాల్లో మూడో వంతు పేదలకు చేరడం లేదు. భారత ఆహార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న 28 శాతం ధాన్యాలు అనుకున్న లబ్ధిదారులకు చేరడం లేదని ఎకనామిక్ థింక్ ట్యాంక్ విడుదల చేసిన రిపోర్ట్‌లో వెల్లడైంది.దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.69,000 కోట్లకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లుతుందని అంచనా. అలాగే.. ఈ వ్యవస్థను తక్షణమే మెరుగుపరచాలనే డిమాండ్ కూడా ఉంది. ఆగస్టు 2022 నుంచి జూలై 2023 వరకు గృహ వినియోగ వ్యయ సర్వే , ఎఫ్‌సీఐ నుంచి నెలవారీ ఆఫ్‌టేక్ డేటా విశ్లేషించారు. ఈ డేటా ప్రకారం.. 20 మిలియన్ టన్నుల బియ్యం, గోధుమలు లబ్ధిదారులకు చేరుకోలేకపోయాయని అంచనా. ఇది వార్షిక నష్టమని ఐసీఆర్ఐఈఆర్ ఇన్ఫోసిస్ ఛైర్ ప్రొఫెసర్ అశోక్ గులాటీ తెలిపారు. ఇది ఎక్కడికి వెళుతోంది? అనే ప్రశ్న అందరిలో ఉత్పన్నమవుతోంది. ఈ ధాన్యం బహిరంగా మార్కెట్‌కు వెళ్తోంది.

### ప్రభుత్వ ఖజానాపై రూ.69 వేల కోట్ల భారం

20 మిలియన్ టన్నుల బియ్యం, గోధుమలు లబ్ధిదారులకు చేరకపోవడం పెద్ద ఆర్థిక భారమని ఈ నివేదిక పేర్కొంది. ఆ ఏడాది గోధుమలు, బియ్యం ఆర్థిక వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఖజానాపై రూ.69,108 కోట్ల భారం పడుతుంది. ఈ సంఖ్య 2011-12లో నమోదైన 46% కంటే గణనీయమైన మెరుగుదలను సూచిస్తున్నప్పటికీ.. ఉచిత/సబ్సిడీ ధాన్యాలలో ఎక్కువ భాగం ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరడం లేదని ఇది ఇప్పటికీ సూచిస్తుంది. ప్రభుత్వం నియమించిన ప్యానెల్ 2015 నివేదికను ఇది ప్రస్తావించిందని, దానిని పక్కనబెట్టారని లేఖ పేర్కొంది.

### పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాల ప్రవేశం..

2016లో సరసమైన ధరల దుకాణాల్లో (రేషన్ దుకాణాలు) పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాలను ప్రవేశపెట్టడం వల్ల కొంత అంతరాన్ని తగ్గించగలిగామని, అయితే దోపిడీలు ఇప్పటికీ గణనీయంగానే ఉన్నాయని పేర్కొంది. పీడీఎస్ లీకేజీలో ఈశాన్య రాష్ట్రాల్లో అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ మొదటి మూడు స్థానాల్లో ఉండగా, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలలో అధిక అధిక దోపిడీకి డిజిటలైజేషన్ లేకపోవడం ప్రధాన కారణాలలో ఒకటిగా పరిగణించబడింది. బీహార్, పశ్చిమ బెంగాల్ గత దశాబ్దంలో గణనీయమైన తగ్గింపును సాధించాయని పేపర్ పేర్కొంది. బీహార్‌లో



2011-12లో 68.7% నుంచి 2022-23లో 19.2%కి తగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో 69.4% నుంచి 9%కి తగ్గింది.

### ఏ రాష్ట్రంలో ఎంత దోపిడీ?


తాజా నివేదిక ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లో పీడీఎస్ 33%గా అంచనా వేయబడింది. పక్కదారి పట్టిన మొత్తం ధాన్యాల పరిమాణంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలలో సైఫనింగ్ రేట్లు చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఇందులో ధాన్యాన్ని మళ్లీ బహిరంగ మార్కెట్‌కు పంపుతున్నారు. పీడీఎస్ కోసం లబ్ధిదారుల రేషన్ కార్డులను ఆధార్‌తో లింక్ చేయడం వల్ల పంపిణీ ప్రభావం పెరిగిందని, అయితే పీడీఎస్‌లో దోపిడీ ఇప్పటికీ ఆందోళన కలిగించే విషయం అని తెలిపింది.

### డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్ ఉన్నప్పటికీ ..

డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్స్ అమలులో ఉన్నప్పటికీ, లీకేజీలు కొనసాగుతున్నాయి. పీడీఎస్ అవినీతిని పరిష్కరించడానికి మెరుగైన పర్యవేక్షణ మాత్రమే కాకుండా నిర్మాణాత్మక సంస్కరణలు కూడా అవసరం. ఈ వ్యవస్థలో ప్రధాన సంస్కరణలు తీసురావడం చాలా ముఖ్యం. ఆహార స్టాంప్ లేదా వోచర్ సిస్టమ్, ప్రత్యక్ష నగదు బదిలీలలో మార్పులను అన్వేషించడం అవసరం. ఎందుకంటే ఇది పారదర్శకతను పెంచుతుంది. అసమర్థతలను తగ్గిస్తుంది. పోషకాహార భద్రతను నిర్ధారించగలదు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పీడీఎస్ లో ఒకటిగా ఉంది. సుమారు 81.4 కోట్ల మందికి బియ్యం, గోధుమలతో సహా ఉచిత ప్రయోజనాలను అందిస్తోంది.

## కడియం శ్రీహరిని పర్వతగిరికి పంపించే వారకు నిద్రపోను

స్టేషన్ ఘన్‌పూర్, నియోజకవర్గంలో నువ్వైనా ఉండాలి.. నేనైనా ఉండాలని కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య స్పందించారు. కడియం సవాలును స్వీకరిస్తున్నానని చెబుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. కడియం శ్రీహరి స్థానికేతరుడు అని.. ఆయన్ను పర్వతగిరి పంపించే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో నువ్వో నేనో మిగలాలని కడియం శ్రీహరి అంటున్నాడని.. ఆయన ఎక్కడ కూడా తనకు పోటీ రాలేదని రాజయ్య అన్నారు. తాను వరుసగా నాలుగుసార్లు గెలిచానని గుర్తుచేశారు. కడియం శ్రీహరి ప్రజా నాయకుడు కాదని.. రాజకీయ నాయకుడు మాత్రమేనని విమర్శించారు. కడియం స్థానికేతరుడు అని.. ఆయన్ను తప్పకుండా తరిమికొడతానని అన్నారు. కడియం శ్రీహరి విసిరిన సవాలును స్వీకరిస్తున్నా అని తాటికొండ రాజయ్య అన్నారు. ‘ నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. ఇక్కడే ఉంటా.. రేపు ఛస్తే ఇక్కడే నన్ను బొంద పెడతారు. ‘ అని చెప్పారు. కానీ నిన్ను స్థానికేతరుడిలాగే గుర్తిస్తారని కడియం శ్రీహరిని ఉద్దేశించి రాజయ్య పేర్కొన్నారు. ఆయన్ను పర్వతగిరికి పంపించే వరకు నిద్రపోనని స్పష్టం



చేశారు. సత్యహరిశ్చంద్రుడిలా నీతిమంతుడినని కడియం శ్రీహరి డబ్బా కొట్టుకోవడం సిగ్గు చేటు అని రాజయ్య విమర్శించారు. ఆయన అనేక అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి తిమింగలంలా అయ్యాడని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కడియం శ్రీహరి రూ.100 కోట్లు ఖర్చు చేశారని తెలిపిన ఆయన.. ఆ 100 కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు.

## సంపాదకీయం

మంగళవారం 19-11-2024

# డిజిటల్ కాలుష్యం – అణు విద్యుత్

'వాతావరణ మార్పు' గురించి మాట్లాడుకునే సందర్భాలలో, నూతన సాంకేతికతలైతే, తక్కువ కర్బన అడుగు జాడల్ని (కార్బన్ ఫుట్ ప్రింట్) వదులుతాయని అంటే తక్కువ కాలుష్య కారకాలుగా ఉంటాయని అనుకుంటాము. గ్రీన్ టెక్నాలజీల ముసుగులో ఈ సాంకేతికతలు చెలామణి అవుతుంటాయి. నీలి హైడ్రోజన్, నాచురల్ గ్యాస్ లాంటి ప్రత్యామ్నాయాల గురించి యూరప్‌లో, అమెరికాలో మాట్లాడుతూ ఉంటారు. మానవ జీవితాన్ని మారుస్తున్న, తీవ్రంగా మార్చబోతున్న ఈ సాంకేతికతలన్నీ (కంప్యూటర్ సాంకేతికతలు, ప్రక్రియలు లాంటివి) ఒక సగటు మనిషికి నిరపాయకరంగానే అనిపిస్తాయి. ఇవి కల్పించే సౌలభ్యంలో పడి, వీటి వల్ల వచ్చే కాలుష్యాలను, గ్రీన్ హౌస్ ఉద్గారాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పటి లాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, స్మార్ట్ ఫోన్లు చాలా శక్తివంతమైనవి. ఎంత శక్తి అంటే, మనిషి చంద్రుడి పైకి వెళ్ళి, మళ్ళీ తిరిగి రావటానికి ఉపయోగపడిన ఒక గది అంత సైజు ఉండే కంప్యూటర్ కంటే కూడా, వందల రెట్లు శక్తివంతమైనవి. ఒక గంట సేపు చార్జి చేస్తే, ఎన్నో గంటల పాటు అవి పని చేయగలవు. వీటిలో సినిమాలు చూడొచ్చు. ప్రశ్నలు అడగొచ్చు. ఇప్పుడైతే, సెర్చ్ ఇంజిన్ల నుండే కాదు, మిలియన్ల బైట్ల సమాచారం ఉండే కృత్రిమ మేధ (ఏ.ఐ)ల నుండి కూడా ఆ జవాబులు పొందొచ్చు. ఈ కృత్రిమ మేధ సర్వవ్యాపితం. సైన్స్ అండ్ టెక్నాలజీ, వైద్యం, సినిమా, కళ, పరిశ్రమలు–అంతటా ఇదే. ఒక క్లిక్‌తో సమాచారం అందుబాటులోకి వచ్చేస్తుంది. అయితే ఇంత భారీ సమాచారం ఎక్కడ నిల్వ ఉంచి ఇస్తున్నారు? అనే అంశాన్ని ఎవరూ ఆలోచించడం లేదు. అలాగే క్రిప్టో కరెన్సీల విషయం కూడా. అమ్ముతున్నారు, కొంటున్నారు. కానీ వాటి తయారీపై ఆలోచన లేదు. పెద్ద పెద్ద సర్వర్లను వాడే కంపెనీలు, ఇప్పుడు పెద్ద పెద్ద క్లౌడ్ సర్వీసులను వాడుతున్నాయి. అవి ఎక్కడో ఉండి, మనకు కనపడకుండానే భారీ సమాచారాలను నిల్వ ఉంచుతున్నాయి. ఇదంతా చాలా అద్భుతంగా, ఒక కొత్త ప్రపంచం లాగా, నమ్మశక్యం కానంతగా అనిపిస్తుంది. పర్యావరణానికి ఏటువంటి హాని కూడా జరగదన్నట్టుగా, సున్నితంగా ఉన్నట్టుగా కూడా ఉంటుంది. కానీ ఒక ప్రమాదకరమైన, భయానకమైన, వికారమైన వాస్తవాలు ఇందులో ఉన్నాయి.

### ఉద్గారాలు

విద్యుత్ ఎక్కువగా వాడే కొద్దీ, ఎక్కువ ఉద్గారాలు వెలువడతాయి. కృత్రిమ మేధ, క్రిప్టో కరెన్సీలు, బిగ్ డేటాలకు చాలా ఎక్కువ విద్యుత్ వాడకం అవసరం అవుతుంది. వినియోగదారుల షాపింగ్ ప్రవర్తనల గుర్తింపు, ముఖ కవళికల గుర్తింపు, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ట్రాకింగ్– లాంటి వాటిల్లో చాలా ప్రాసెసింగ్ ఉంటుంది. ఈ ప్రక్రియ కంటికి కనిపించదు. కానీ పెద్ద పెద్ద సర్వర్లు, వాటిని ఉంచే పెద్ద పెద్ద భవనాలు, వాటికున్న బృహత్తరమైన కంప్యూటింగ్ శక్తి సామర్థ్యాలు, వాటిని చల్లబరిచేందుకు ఎంతో నీరు, పెద్ద పెద్ద ఫ్యాన్లు అవసరమవుతాయి. ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ వాడినప్పుడు, ఉద్గారాలు కూడా పెరుగుతాయి. పునరుత్పాదక శక్తి వాడినప్పుడు, శిలాజ వనరులు వాడినప్పటి కంటే తక్కువ ఉద్గారాలు వెలువడవచ్చు. కానీ వాటి వల్ల వచ్చే, అదనపు సమస్యలు వేరే ఉన్నాయి. ఈమధ్య కాలంలో, డిజిటల్ ప్రపంచం నుంచి వెలువడుతున్న ఉద్గారాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 2010 సంవత్సరంలో ఇంటర్నెట్‌తో అనుసంధానింపబడిన పరికరాలు 100 కోట్లు ఉంటే, 2025 వచ్చేసరికి 5000 కోట్లు, 2030 వచ్చేసరికి 10000 కోట్లు ఉంటాయని అంచనా. మొత్తం ప్రపంచ వ్యాప్త ఉద్గారాలలో డిజిటల్ రంగం నుండి వచ్చేవే, 3.5 శాతం దాకా ఉండొచ్చు. వైమానిక రంగం నుంచి వచ్చే ఉద్గారాలను (2.5 శాతం) ఇది ఇప్పుడు మించిపోయింది. వాస్తవిక కరెన్సీని అనుకరించే, దాదాపు సమానమనిపించే క్రిప్టో కరెన్సీని వెలికి తీయడానికి కూడా ఎంతో డేటా వినియోగం, శక్తి వినియోగం జరుగుతుంది. గ్లోబల్ ఉద్గారాలలో దీని వాటా 0.7 శాతం ఉంటుంది. వీటన్నింటిలో, ఉత్పత్తి ప్రక్రియల వల్ల సగం ఉద్గారాలు వెలువడితే, మరో సగం వినియోగం ద్వారా వెలువడతాయి. స్మార్ట్ ఫోన్ల వినియోగం, కృత్రిమ మేధ వినియోగం పెరిగే కొద్దీ, ఎన్నో రెట్లు ఈ ఉద్గారాలు కూడా పెరుగుతాయి.

### ఉద్గారాల లెక్కలు –సమస్యలు

ఈ ఉద్గారాలను సరిగ్గా లెక్కించాలంటే, అవసరమైన డేటాను పరిశ్రమలు ఇవ్వడం లేదు. ఇతర పరిశ్రమలలో ఉన్నట్టుగా, ఉద్గారాలకు సంబంధించిన ప్రామాణికరింపబడిన లెక్కలు కానీ, ప్రోటోకాల్స్ గాని ఇక్కడ లేవు. ప్రాసెసింగ్ ఎంత జరుగుతోందనే సమాచారం మాత్రం కొంత ఉంది. క్లౌడ్ కంప్యూటింగ్, డేటా స్టోరేజ్, ఏ.ఐ ప్రాసెసింగ్ లాంటివి జరిగే డేటా సెంటర్లకు, క్రిప్టో కరెన్సీ మైనింగ్‌లకూ అవసరమయ్యే విద్యుత్తు, ప్రపంచ విద్యుత్తు వినియోగంలో 2 శాతం దాకా ఉంటే, ఉద్గారాలు 1 శాతం వరకూ ఉండొచ్చు. అయితే ఇవన్నీ కూడా పాత లెక్కలే. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఏ.ఐ సర్వీసులు, ఏ.ఐ సాఫ్ట్‌వేర్లు, హార్డ్‌వేర్ల విస్ఫోటానికి ముందు లెక్కలు ఇవన్నీ. ఈ మధ్య ఐఎంఎఫ్ ఒక లెక్క వేసింది. డేటా సెంటర్లు, క్రిప్టో కరెన్సీల వాటా ప్రపంచ విద్యుత్ వినియోగంలో 3.5 శాతం ఉండవచ్చని చెప్పింది. ఇది ఐదవ పెద్ద దేశమైన, జపాన్ విద్యుత్ వినియోగానికి దాదాపు సమానం. అయితే కచ్చితంగా లెక్క వేయడం ఇప్పటికీ సాధ్యం కావడం లేదు. ప్రపంచంలోని ఎక్కడెక్కడి ప్రాంతాలకో డేటా ప్రాసెసింగ్‌ను, క్లౌడ్ స్టోరేజ్‌ను, ఔట్ సోర్స్ చేయడం లాంటి బిజినెస్ మోడళ్ల వల్ల కచ్చితమైన లెక్కలు సాధ్యం కావడం లేదు. ఇదంతా డేటా ప్రాసెసింగ్‌కు సంబంధించిన విషయం. కానీ డేటా వినియోగం, వైపు నుండి ఎంత ఉద్గారాలు వస్తాయనే విషయంలో చాలా తక్కువ అధ్యయనం ఉంది. ఈ మధ్య కాలంలోనే ఎం.ఐ.టి లాంటి చోట్ల కొన్ని అధ్యయనాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు ఏ.ఐ ని ఉపయోగించి ఒక ఇమేజ్‌ను సృష్టించడానికి అయ్యే విద్యుత్తు, ఒక స్మార్ట్ ఫోన్‌ను పూర్తిగా చార్జ్ చేయడానికి అయ్యే విద్యుత్‌తో సమానమని అంటున్నారు. గూగుల్ సెర్చ్ కంటె చార్ట్ జిపిటి పదింతలు ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తుందని అంటున్నారు. చాలా స్మార్ట్ ఫోన్లలో, ఏ.ఐ డిఫాల్ట్ ఆప్షన్‌గా ఉంది. అంటే గూగుల్ సెర్చ్‌కు అడ్డుపడుతుంది. సాధారణ సాఫ్ట్‌వేర్ కంటే ఈ ఏ.ఐ సాఫ్ట్‌వేర్ 33 రెట్లు ఎక్కువ విద్యుత్తును వాడుకుంటుంది. వరల్డ్ ఏకనమిక్ ఫోరం అంచనా ప్రకారం, ఏ.ఐ కంప్యూటింగ్, ప్రతి వంద రోజులకు రెండింతలు పెరుగుతోంది.

### బిగ్ ఫైవ్

విద్యుత్ వినియోగం, కాలుష్య ఉద్గారాల విషయంలో మొదటి ఐదు స్థానాల్లో పెద్ద కంపెనీల డేటా సెంటర్లే ఉన్నాయి. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, మెటా–ఈ ఐదు కంపెనీలూ అవడం పెద్ద ఆశ్చర్యం కాదు. రెండవ స్థానంలో ఉన్న యాపిల్ కంటే, మొదటి స్థానంలో ఉండే అమెజాన్ వెలువరించే ఉద్గారాలు రెండింతలు వుంటాయి. అయితే చాలా అధ్యయనాలు అమెజాన్‌ను వదిలేస్తాయి. ఎందుకంటే అమెజాన్ డేటా వినియోగం, కంప్యూటింగ్ మోడళ్లు విభిన్నంగా ఉండి, ఇతర కంపెనీలతో పోలిక కష్ట సాధ్యం చేస్తాయి. ద గార్డియన్ పత్రిక ఒక అధ్యయనం చేసింది. మిగిలిన నాలుగు కంపెనీలు (అమెజాన్ మినహా) అధికారికంగా ఇచ్చే లెక్కల కంటే, వాటి వాస్తవ ఉద్గారాలు 662 శాతం ఎక్కువ ఉంటాయని, ఆ అధ్యయనం చెబుతుంది.

# ఖజానాకు 'మహా' హామీల భారం




హైదరాబాద్,రాష్ట్రాల ఆర్థిక పరిస్థితికి మించి ఎన్నికల్లో హామీలు ప్రకటిస్తే అమలు చేయడం చాలా కష్టమని, ఖజానా దివాళా తీసే దుస్థితి ఏర్పడుతుందని, ప్రధాని మోడీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తమ నాయకులకు పదేపదే హెచ్చరిస్తున్నా ఓట్ల కోసం మితిమీరిన వ్యయంతో కూడిన హామీలు ఇస్తుండటం పరిపాటి అవుతోంది. ఈ నెల 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి, విపక్షాల మహావికాస్ అఘాడీ కూడా ఉచిత హామీలు ప్రకటించడంలో పోటీపడ్డాయి. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా కోలుకోలేని దుస్థితిలో అల్లాడుతుండగా, ఇప్పుడు ఈ ఎన్నికల ఉచిత హామీలు ఆర్థిక దుస్థితికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో పరాజయం చవిచూసిన బిజెపి సంకీర్ణ మహారాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో ఊహాతీత అద్భుతమైన వరాలను కురిపించింది. మహారాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ రూ. 6,12,293 కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో అనేక హామీలు కూడా ఉన్నాయి. దారిద్ర్యరేఖన దిగువన ఉన్న కుటుంబాలకు ఏడాదికి ఉచితంగా మూడు ఎల్‌పిజీ సిలిండర్లు, రాష్ట్రంలోని రైతులకు ఉచిత విద్యుత్, ముఖ్యమంత్రి లడకీ బహిన్ యోజన పథకం కింద మహిళలకు నెలనెలా రూ. 1500 తదితర ఉచిత హామీలు బడ్జెట్‌లో చేర్చారు. అయితే ముఖ్యమంత్రి లడకీ బహిన్ యోజన పథకం ఒక్కటే ఏటా రూ. 46,000 కోట్ల వరకు ఖర్చు భరించవలసి వస్తోంది. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ పథకాల వాటాలను మరింత పెంచేశారు. బిజెపి కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే లడకీ బహిన్ యోజన పథకం కింద మహిళలకు నెలకు రూ. 2100 వంతున ఇస్తామని ప్రకటించారు. అంటే మరో రూ. 600 వంతున అదనపు భారం ఈ పథకం కింద మహిళలకు చెల్లించవలసి వస్తుంది. ఇదిలా ఉండగా విపక్షాలు కూడా ఈ విషయంలో వెనకడుగు వేయలేదు. మహాలక్ష్మియోజన పథకం కింద మహిళలకు నెలకు రూ. 3000 వంతున చెల్లిస్తామని ప్రకటించారు. దీంతోపాటు ఓటర్లను ఆకట్టుకోడానికి మరిన్ని ఉచిత హామీలు ప్రకటించారు. ప్రతి పార్టీ మరో పార్టీతో పోటీపడి ప్రజలకు అత్యంత విలాసవంతమైన బహుమతుల వాగ్దానాలను కురిపిస్తోంది. ఇదంతా పైపైన బ్రహ్మాండంగా కనిపిస్తున్నా లోతుకు వెళ్లి పరిశీలిస్తే రాష్ట్ర ఆర్థిక గణాంకాలు అత్యవసర హెచ్చరికలను జారీ చేస్తున్నాయి. రాష్ట్ర రెవెన్యూ లోటు రూ. 20,151 కోట్లకు చేరుకుంది. రాష్ట్ర బడ్జెట్ ద్రవ్యలోటు చాలా భయంకరంగా 2025 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,10,355 కోట్లకు చేరుకోవడం ఆలోచించవలసిన విషయం. బడ్జెట్ ద్రవ్యలోటు ఇప్పటికే 2024 ఆర్థిక సంవత్సరంలో రెట్టింపు అయింది. అయితే ఇది ఎఫ్ఆర్‌బిఎం (ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం) పరిమితిలో ఉన్నప్పటికీ అకస్మాత్తుగా ఈ పరిమితి మించిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం అనేది ఆర్థిక క్రమశిక్షణను సంస్థాగతీకరించడానికి, దేశ ఆర్థిక లోటును తగ్గించడానికి, స్థూల ఆర్థిక నిర్వహణను మెరుగుపరచడానికి, ప్రభుత్వ నిధుల మొత్తం నిర్వహణను సమతుల్య బడ్జెట్‌తో, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ చట్టాన్ని రూపొందించారు. అయితే ఇప్పుడు ఉచిత హామీల భారం బడ్జెట్ సమతుల్యతను దెబ్బతీస్తోంది. 202324 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రుణభారం వార్షిక వడ్డీ చెల్లింపులు రూ. 48,578 కోట్లతో కలుపుకుని రూ. 7,11,278 కోట్లకు చేరింది. 202324లో రాష్ట్ర రుణభారం అంతకు ముందు సంవత్సరం కన్నా 16.5 శాతం మించి పెరిగినప్పటికీ, స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జిఎస్‌డిపి) 17.6 శాతం నిర్దేశించిన పరిధిలోనే (జిఎస్‌డిపిలో 25 శాతం) ఉందని రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంటోంది. 2019 నుంచి 202425 వరకు రాష్ట్ర ఆర్థిక పరిమాణం కరోనా ముందటి పరిస్థితిలా స్థిరంగానే కనిపించింది. అయితే కొవిడ్ 19 షాక్‌తో రాష్ట్రంలో ఆదాయం కన్నా వ్యయం విపరీతంగా పెరిగింది. 2023 24. 2024 25లో అత్యధిక లోటు స్థాయిలు సుదీర్ఘ కాల ఆర్థిక సుస్థిరతకు ప్రశ్నార్థకంగా తయారయ్యాయి. ఇది క్రెడిట్ రేటింగ్‌పై తీవ్ర ప్రభావం చూపించింది. ఈ ఆర్థిక లోటు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యయం కింద అత్యధికంగా ఖర్చు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలియజేస్తోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక లోటు పాట్లను తప్పించడానికి బలమైన ఆర్థిక కార్యాచరణ వ్యూహాలు తప్పనిసరి. 202324 లో మూలధన వ్యయం వృద్ధి, ఆర్థిక లోటు పెరుగుదలతో సమానంగా కనిపించింది. ఇది రాష్ట్రం వ్యయాలన్నిటినీ భరించడానికి రుణాలు తీసుకోవడమో లేదా ఇతర ఆర్థిక వనరులను వినియోగించుకోవడమో జరిగినట్టు స్పష్టమవుతోంది. సుదీర్ఘ కాల రుణ భారాలను తప్పించుకోవడానికి రాష్ట్రం ఆర్థిక విషయంలో తులనాత్మకంగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. 202425 ఆర్థిక లోటు రెవెన్యూ తగ్గుదలకు సవాలుగా ఉంటుంది. ఆర్థిక అస్థిరత, ఇతర ఆర్థిక ప్రాధాన్యతలపై దృష్టి మళ్లించడం, రుణాలు తీసుకురావడం, సంక్షేమానికి ఖర్చు చేయడం ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక రంగానికి సవాలుగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వ్యయాన్ని క్రమబద్ధీకరించుకోవాలని, ఆర్థిక వనరులను సమీకరించుకోవాలని కాగ్ 2023 నివేదిక కూడా మహారాష్ట ప్రభుత్వానికి హెచ్చరించడం ఆలోచించాల్సిందే.

# పరిపాలనలో డేరింగ్ రేవంత్

సెంట్రల్ డెస్క్: ప్రజా పాలన విజయోత్సవాలకు సిద్ధమవుతున్న రేవంత్ ప్రభుత్వం కీలక అభివృద్ధి పనులను చేపడుతోంది. వడ్ల కొనుగోళ్ల దగ్గరి నుంచి మైనార్టీల సంక్షేమం దాకా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్ పోస్టులకు ఎంపికైన వారికి సీఎం స్వయంగా నియామక పత్రాలను సీఎం అందించారు. గత 11 నెలల్లో తెలంగాణ ఏం పొందిందో సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటిదాకా వెనుకబడ్డ జిల్లా ఏదంటే అందరూ చెప్పేది మహబూబ్‌నగర్ జిల్లా గురించే.. అయితే.. ఇప్పుడు అదే పాలమూరు నుంచి సీఎంగా రేవంత్ రావడంతో రూపురేఖలు మార్చేలా కార్యాచరణ రెడీ చేస్తున్నారు. పదేళ్లుగా, అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన ఈ జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించే పనికి తానే స్వయంగా బాధ్యత తీసుకున్నారు.


### కురుమూర్తిస్వామి దర్శనంతో..

ఈనెల 10వ తేదీన చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి స్వామి ఆలయాన్ని సీఎం రేవంత్ సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 110 కోట్ల రూపాయలతో కురుమూర్తి స్వామి ఆలయ ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. పాలమూరుకు గతంలో అన్యాయం జరిగిందని, ఇక్కడి ప్రజలు ఓట్లు వేస్తేనే కేసీఆర్ రెండుసార్లు సీఎం అయ్యారని, కానీ, కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాకు పరిశ్రమలు, ప్రాజెక్టులూ రాలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. పాలమూరు రుణం తీర్చుకుంటానని, మక్తల్, నారాయణపేట్, కొడంగల్ కు కృష్ణా జలాలు తీసుకువస్తామన్నారు. గ్రామాలకు, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత తనదే అని, బీటీ రోడ్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. టీజీపీఎస్సీ స్వరూపం మార్చేందుకు శ్రీకారంతెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఒకప్పుడు లీకులు, సరైన సిబ్బంది లేక ఇబ్బందులతో కనిపించేది. కానీ, రేవంత్ ప్రభుత్వం మాత్రం టీజీపీఎస్సీ స్వరూపాన్ని పూర్తిగా మార్చేందుకు సిద్ధమైంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిపాలన, పరీక్షల విధానాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం ది. టీజీపీఎస్సీకి అదనంగా 142 పోస్టులు మంజూరు చేసింది. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఇందుకు సంబంధించి ఉత్తర్వులు రిలీజ్ చేశారు. కొన్ని భర్తీలను ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై, మరికొన్నింటిని ప్రత్యక్ష నియామకం కింద ప్రభుత్వం అనుమతించింది. టీజీపీఎస్సీ



బలోపేతం కోసం కమిషన్ ప్రత్యేకంగా ఇటీవలే ఓ కమిటీని నియమించింది. ఈ కమిటీ లోతైన స్టడీ చేసి రిపోర్ట్ ఇచ్చింది. ఆ ప్రకారం టీజీపీఎస్సీలోనూ యూపీఎస్సీ తరహా పరిపాలన, పరీక్షల నిర్వహణ విభాగాలు ఉండేలా చర్యలు సూచించింది. నియామకాల జాతరచెప్పినట్లుగానే రేవంత్ ప్రభుత్వం నియామకాల జాతర కొనసాగిస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులను జాబ్ క్యాలెండర్ ప్రకారం ఎప్పటికప్పుడు భర్తీ చేస్తోంది. రవాణా శాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మోటార్ వెహికిల్ పోస్టులకు ఎంపికైన వారికి ఈనెల 11న సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. 113పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి. దీంతో రవాణాశాఖలో సిబ్బంది కొరత ఎక్కువైంది. దీంతో అపాయింట్ మెంట్ లెటర్లు అందించారు. రైతులను మోసం చేస్తే ఎస్మావడ్ల కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. అలాంటి వ్యాపారులపై అవసరమైతే ఎస్మా చట్టం కింద చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలు సీఎం దృష్టికి రాగానే ఆదేశాలు జారీ చేశారు. రైతుల పంట కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రమంతటా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు ఫ్యూచర్ ప్లాన్స్తెలంగాణ అభివృద్ధి గురించి సీఎం రేవంత్ పూర్తి విజన్ తో ఉన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఏ కార్యక్రమంలో పాల్గొన్నా తాము పెట్టుకున్న లక్ష్యాలు తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తున్నారు. తాజాగా ఢిల్లీలో ఓ కాంక్లేవ్ లో పాల్గొన్న సీఎం నాలుగు భవిష్యత్ లక్ష్యాల గురించి చెప్పారు. అందులో ఒకటి ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్స్ వంటివి పూర్తి చేసి తీరుతామన్నారు.

# ప్రతి పేదోడికి కూడు, గూడు లక్ష్యంగానే టీడీపీ పాలన



అమరావతి, తెలుగుదేశం పార్టీ ప్రతి పేదవాడికి కూడు, గూడు, నీడ ఉండాలనే లక్ష్యంతో పనిచేసిందని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. టిడ్కో ఇళ్లపై అసెంబ్లీలో లఘు చర్చ జరిగింది. ఈ విషయంపై ఆంజనేయులు కీలక విషయాలు తెలిపారు. 7 లక్షలు ఇళ్లను గతంలో ఎన్డీఏ ప్రభుత్వం శాంక్షన్ చేశారని అన్నారు. మొదటి దశలో 4 లక్షల 54 వేల ఇళ్లకు టెండర్‌లు పిలిచారని గుర్తుచేశారు. 2019 ప్రారంభానికి 3 లక్షల 13 వేల 832 ఇల్లు 90 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. ఒక్క రూపాయికి ఇల్లు ఇస్తామని జగన్ మోసం చేశారని విమర్శించారు. ఏడాదికి 5 లక్షలు ఇల్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోలేదని అన్నారు. ఐదేళ్లలో 25 వేల ఇల్లు అన్నారని.. అయితే పట్టించుకోలేదని చెప్పారు. జగన్ మోహన్ రెడ్డికు ప్యాలెస్‌లు కావాలని అన్నారు. బెంగళూరు, హైదరాబాద్, రుషికొండలో వాటిని కట్టారని చెప్పారు. రూ.430 కోట్లు ఖర్చు చేసి రుషికొండ ప్యాలెస్ కట్టారన్నారు. పేదవాడికి ఒక సెంట్ ఇల్లు అని, జగనన్న కాలనీ అన్నారని...అందులోనూ అక్రమాలు జరిగాయని తెలిపారు. ఎన్డీఏ మళ్లీ వచ్చి ఉంటే ఈ లక్షలాది ఇల్లు పూర్తి అయ్యేవని అన్నారు. ఇల్లు రాకపోగా పేదలకు బ్యాంక్‌ల నుంచి వాయిదాలు కట్టమని నోటీసులు వచ్చాయని అన్నారు. టిడ్కో ఇళ్ల కోసం రూ. 17 కోట్లు వడ్డీ చెల్లించారని... పేదవాడి డిపాజిట్లు చెల్లించలేదని అన్నారు. ఈ ఇళ్లను కూడా పేద వాళ్లకు కాకుండా వాళ్ల ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చారని చెప్పారు. 90 శాతం ఇల్లు పూర్తి అయినవి కూడా ఐదేళ్లలో పూర్తి చేయలేదని మండిపడ్డారు.

# తెలుగు చిత్రసీమలో ట్రెండ్ సెట్టర్

హైదరాబాద్, తెలుగు చిత్రసీమలో సూపర్‌స్టార్‌గా పేరున్న నటశేఖ కృష్ణ రణించి రెండేళ్లు పూర్తయ్యాయి. 2022 నవంబర్ 15న పరమపదించారు. ఆయన ఓ ట్రెండ్ సెట్టర్‌గా పేరు సంపాదించారు. తెలుగు చలనచిత్ర సీమలో ఎందరో నటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, నిర్మాతలు తమదైన ముద్ర వేశారు. వారంతా చిత్రరంగం అభివృద్ధికి దోహదపడ్డారు. చిత్రరంగం నుంచి కూడా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు దక్కాయి. అనుబంధ రంగాల్లో ఎందరో ఉపాధి పొందు తున్నారు. ఇలా ఆనాటి నుంచినేటి వరకు చిత్రసీమ అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తోంది. ఈ క్రమంలో తమిళనాట స్థిరపడ్డ చిత్రరంగాన్ని హైదరాబాద్‌కు రప్పించే ప్రయత్నంలో అనేకానేకమంది కృషి చేశారు. ఆనాటి సిఎం చెన్నారెడ్డి పట్టుబట్టి వారిని హైదరాబాద్ రప్పించే ప్రయత్నం చేశారు. వారు ఇళ్లు కట్టుకోవడానికి, స్టూడియోలు కట్టుకోవడానికి స్థలాలు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ క్రమంలో చిత్రరంగంలో తనదైన ముద్ర వేసిన కృష్ణ కూడా హైదరాబాద్‌లో పద్మాలయా స్టూడియోస్ నిర్మాణం చేపట్టారు. అలాగే సినిమా రంగంలో ప్రత్యేకించి తనదైన ముద్రవేశారు. ఓ రకంగా చెప్పాలంటూ కృష్ణ సినిమా రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారు. ఇలా ఓతరానికి చెందిన నటుడిగా కృష్ణ నిలిచారు. అంతే గాకుండా అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడు. తొలి 70 ఎంఎం చిత్రం, తొలి జేమ్స్ బాండ్ చిత్రం, తొలి కౌబాయ్ చిత్రం, తొలి ఫుల్ స్కోప్ చిత్రం, తొలి ఈస్ట్ మాన్ కలర్, తొలి డీటీయస్ సినిమా.. ఇలా చెప్పుకుంటే పోతే కృష్ణ సినీప్రస్థానం లో ఎన్నో ప్రయోగాలు చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ఇండిస్ట్రీలో నూతన ఒరవడికి ఆద్యుడిగా నిలిచిపోయారు. ఇవాళ ఈ ప్రయోగాలన్నీ కూడా చిత్రరంగంలో పెను మార్పులకు కారణం అయ్యాయి. ఎన్నెన్నో ప్రయోగాలకు తానే ముందు నిలిచిన కారణంగా మరెందరో కృష్ణను అనుకరించారు. అంతే గాకుండా ప్రత్యేకించి అభిమానులను సంపాదించుకున్నారు. ఇకపోతే కృష్ణలో మరో ప్రత్యేక గుణం ఉంది. సినిమా ప్రివ్యూ చూశాక అది ఆడుతుందో లేదో ఇట్టే చెప్పేశావారట. అందుకే మహేశ్ బాబు తన సినిమాల ఆడుతుందా లేదా అన్నది తండ్రి చెప్పాకనే విడుదల చేశారని అంటుంటారు. కృష్ణకు సినిమా నాడి బాగా తెలుసు. ఏ సమయంలో ఏ సినిమా తీస్తే ఆడుతుందో కూడా తెలుసు. ఎంచుకున్న కథలను కాలనుగుణంగా విడుదల చేసేవారు. ఎంచుకున్న కథలు, సినిమాల నిర్మాణంలో వేడం,ఎందరినో ఆదుకున్న మంచి మనసు కారణంగానే ఆయనొక సూపర్ స్టార్ కాగలిగారు. హీరో కృష్ణగా దాదాపు నాలుగు దశాబ్దాలు వెండితెరను ఏలినప్పటికీ ఎవరికీ ఎలాంటి పోటీ కాలేదు. తనకుతానే పోటీ అన్న విధంగా చిత్రరంగంలో ఎదిగారు. అలా కృష్ణ తెలుగు సినీ పరిశ్రమకు స్ఫూర్తిదాయక సేవలు అందించారనే చెప్పాలి. సూపర్‌స్టార్‌గా అభిమానుల గుండెల్లో చెరగని ముద్రవేసిన ఆయన సినీ ప్రస్థానం సాహసమే ఊపిరిగా.. ధైర్యమే ఆయుధంగా సాగింది. పౌరాణికం, సాంఘికం, జానపదం, జేమ్స్‌బాండ్ చిత్రాల్లోనే కాదు చారిత్రక నేపథ్య కలిగిన చిత్రాలను సైతం తెరకెక్కించారు. వెండితెరపై కృష్ణ సృష్టించిన సంచలనాలకు కొదవలేదు. చాలా తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేయడం కూడా కృష్ణకే చెల్లింది. అలా ఏడాదికి పదికి పైగా సినిమాలు చేసేవారు. ఒక ఏడాది 17 సినిమాల్లో నటించారు. 9 ఏళ్లలో అన్ని పాత్రలు కలుపుకుని 100 సినిమాలు చేశారు. వందవ సినిమాగా వచ్చిన 'అల్లూరి సీతారామరాజు' చలనచిత్రరంగంలో ఓ ప్రభంజనం సృష్టించింది. అప్పటివరకు కృష్ణ నటించిన చిత్రాలన్నీ ఒక ఎత్తయితే,ఈ సినిమా ఒక్కటీ మరో ఎత్తు. సంభాషణలు పలికే తీరు, హావభావాలు ప్రదర్శించే విధానం, ఆహార్యం వంటి విషయాల్లో ఆయన తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అశేష అభిమానులకు దగ్గర చేసింది. 'మోసగాళ్లకు మోసగాళ్లు'తో ఆ లోటును తీర్చేశారు కృష్ణ. అప్పట్లోనే ఈ చిత్రం పాన్ ఇండియా చిత్రంగా పలు భాషల్లో విడుదలైంది. ఇంగ్లీషులో సంచలనం సృష్టించిన మెకానస్ గోల్డ్ చిత్రం స్ఫూర్తితో దీనిని తెరకెక్కించిన తీరు ఇప్పటికీ వండరే. అప్పుడే ఈస్ట్‌మన్ కలర్‌లో దీనిని నిర్మించిన ఘనత కృష్ణకు మాత్రమే దక్కింది. ఇకపోతే గూఢచారి సినిమాలను కూడా తెలుగుసీమకు పరిచయం చేశారు. క్రైమ్ అండ్ థ్రిల్లర్ జోన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కృష్ణ సినిమాలు నిలిచేవి. అప్పటివరకు సాగుతున్న ఒరవడిని అధిగమించి తన సినిమాల్లో వైవిధ్యం చూపించేందుకు ఎంతటి సాహసమైనా చేసేవారు. అలా 'కొల్లేటి కాపురం' సినిమాతో తెలుగు తెరకు ఆర్.ఓ సాంకేతికతనకు పరిచయం చేశారు. 'గూడుపుఠాణి' చిత్రాన్ని మొదటి ఆర్ డబ్ల్యు కలర్‌తో తీశారు. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం 'భలే దొంగలు'. తొలి 70 ఎంఎం సినిమా 'సింహాసనం'. స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి సినిమా ఇది. తొలి ఫుల్‌స్కోప్ చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. కృష్ణ నటించిన మల్టీస్టారర్ రికార్డును ఇంతవరకు ఎవరూ అందుకోలేకపోయారు. తన తరం నటులతో మొదలైన ఆయన మల్టీస్టారర్ ప్రస్థానం తన తరువాతి తరం నటులతో కూడా కొనసాగింది. 'మల్టీస్టారర్ మూవీ అంటే ఇలా ఉండాలి' అన్న మార్క్‌ను క్రియేట్ చేశారు. కెరీర్ మొత్తంలో 50 మల్టీస్టారర్స్ చేశారు. కృష్ణ తొలిసారి దర్శకత్వం వహించిన సినిమా 'సింహాసనం'. కుటుంబ బంధాలు, ఆత్మీయత, రక్తసంబంధాలు మేళవించిన సినిమాల్లో ఆయన నటించారు అనడం కంటే జీవించారు. ఇలా అనేకానేక వైవిధ్యమైన పాత్రలతో ముందుకు వచ్చారు కనుకనే కృష్ణకు అభిమానులు ఎక్కువ.

# గట్టి పోటీ..

హైదరాబాద్,త్వరలో తెలంగాణ శాసనమండలిలో 9స్థానాలు ఖాళీ కాబోతున్నాయ్అనే నేను ఎమ్మెల్సీగా అనేందుకు అధికార, విపక్షాల్లో నేతలు ఎవరి ప్రయత్నాలు వాళ్లు మొదలుపెట్టారు. వీటిలో ఒకే ఒక్క స్థానం గులాబీ పార్టీకి దక్కనుంది. దీంతో ఆ సీటు దక్కించుకుబోయే అదృష్టవంతుడు ఎవరా అని.. కారు పార్టీలో జోరుగాచర్చ జరుగుతోంది. ఇంతకీ ఆ ఒక్క స్థానానికి పోటీ పడుతోంది ఎవరు.. కేసీఆర్ మనసులో ఎవరి పేరు ఉంది.. పెద్దల సభలో మరికొన్ని నెలల్లో పలువురు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. శాసనసభ్యుల కోటా, పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన నేతల పదవీకాలం కంప్లీట్ కానుంది. వీరిలో గులాబీ పార్టీకి చెందిన మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గే మల్లేశం పదవీకాలం పూర్తికాబోతోంది. ఎంఐఎం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మీర్జా రియాజ్ ఉల్ ఎఫెన్దీపట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జీవన్ రెడ్డి%% ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సిరెడ్డి, రఘోత్తమ్ రెడ్డి పదవీకాలం పూర్తి కానుంది. శాసనసభ్యుల సంఖ్యా బలంపరంగా.. అధికార పార్టీకి మెజారిటీ స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నాయ్. రెండు స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేసే చాన్స్ ఉంది.

### ఇప్పటి నుంచే చర్చలు మొదలు

ఎమ్మెల్యే కోటాలో పదవీకాలం పూర్తవుతున్న నలుగురు గులాబీ నేతల్లో కేసీఆర్ కు అత్యంత సన్నిహితులైన శేరి సుభాష్ రెడ్డి, మహముద్ అలీ ఉన్నారు. ఐతే త్వరలో ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా.. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలపై గులాబీ పార్టీలో ఇప్పటి నుంచే చర్చలు మొదలయ్యాయ్. శాసనసభ్యుల సంఖ్యాపరంగా.. రెండు స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేసే చాన్స్ ఉంది. ఐతే పది మంది ఎమ్మెల్యేలు.. బీఆర్ఎస్కు గుడ్ బై చెప్పడంతో.. ఒకే ఒక్క స్థానం మాత్రమే గులాబీ పార్టీ దక్కించుకోనుంది. ఆ ఒక్కరు ఎవరన్నది ఇప్పుడు పార్టీలో చర్చకు దారి తీస్తోంది. ఈ స్థానాన్ని ఎవరికీ కట్ట పెట్టాలన్న దానిపె పార్టీ ఒక సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

# బిజెపి ప్రతిష్టకు కీలకంగా రెండు రాష్ట్రాలు



న్యూఢిల్లీ,జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బిజెపి సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లో విజయం కోసం అతిరథ మహారథులు ప్రచారం చేస్తున్నారు. ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌థాన్,యోగి ఆదిత్యనాథ్ తదితరులంతా రంగంలోకి దిగారు. ఎపి నుంచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూడా ఎన్‌డిఎకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. రెండు రాష్ట్రాల్లోనూ గెలుపు తమదే అన్న ధీమాలో బిజెపి ఉంది. నవంబర్ చివరి వారంలో పార్లమెంట్ సమావేశాలకు ముందే ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయి. జమిలి ఎన్నికల గురించి పట్టుదలగాఉన్న బిజెపికి ఈ గెలుపు అనివార్యం. ఎన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే అంతగా అనుకూలం కాలగలదు. అందుకే సర్వశక్తులు ఒడ్డుతోంది. గత పదేళ్లలో భారతీయ జనతా పార్టీ ఒక అజేయ శక్తిగా ఎదిగింది. అయినా కాంగ్రెస్ ముక్త భార్త అంతగా పనిచేయలేదు. కాంగ్రెస్ పడిలేచిన తరంగంలా దూసుకుని వస్తోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో విపక్ష స్థానం దక్కించుకుంది. దీంతో రాహుత్ ఛరిష్మా కొంత పెరిగింది. అయితే బిజెపి ప్రజల పరంగా ఇష్లవాత్కనిర్ణయాలు తీసుకోవడం లేదు. పెరుగుతున్న ధరలు, జిఎస్టీ, నిరుద్యోగం, ఉపాధి కల్పన, బ్యాంక్వడ్డీలు, బంగారం ధలు వంటివన్నీ ప్రజలను కుంగదీస్తున్నాయి. దీంతో బిజెపి తాను ఎంతో చేశానని చెప్పుకున్న ప్రజలకు ఎక్కడం లేదు. అందుకే ఎన్నికల్లో ఘన విజయవాలు దక్కడం లేదు. పది సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో భారీ కుంభకోణాలు జరిగాయి.అవినీతి రహిత స్వచ్ఛమైన పాలన, అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే బిజెపిని తిరిగి గెలిపించాలని బిజెపి నేతలు పదేపదే కోరుతున్నారు. ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలోనూ, రాష్ట్రాల్లోను ప్రతి రోజూ ఒకరిద్దరు చొప్పున బిజెపిలో చేరుతున్నారు. దేశమంతటా డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడాలని పిలుపునిస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. సిద్ధాంతాలను వల్లె వేసే వామపక్షాలు ఇతరుల దయాదాక్షిణ్యాలకోసం అర్రులు చాచడంతో అవి దిగజారిపోయాయి. సీతారం ఏచూరి మరణం కూడా లెఫ్టార్టీల ఉనికికి దెబ్బ. ఈ క్రమంలో జమిలి ఎన్నికల ద్వారా బిజెపి తన పట్టును నిలుపుకోవాలని చూస్తోంది. ఇప్పటికే జమిలిపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నివేదిక సమర్పించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే దీనిపై అటోఇటో తేలనుంది. మరోవైపు బిజెపికి వ్యతిరేకంగా ఇండియాకూటమి కూడా గట్టిగానే ప్రచారం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ఇక్కడి వనరులను బడా కార్పొరేట్లు దోపిడి చేస్తారని ఇండియా కూటమినేతలు అన్నారు. కాబట్టి బిజెపి అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించి తీరాలని, కాషాయ నేతల చొరబాటును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ వస్తున్న కూటమని గెలిపించాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన కాకుండా బిజెపి మతతత్వ అజెండాతో ప్రచారం దట్టిస్తోందని, ఆదివాసీలకు, ఇతర సామాజిక తరగతుల ప్రజలకు మధ్య చిచ్చురాజేసి జార్ఖండ్‌లో కాషాయ పార్టీ లబ్ది పొందాలని కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. ప్రజలందరికీ విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై రాజకీయ నేతలు దృష్టి సారించేలా ప్రజలు డిమాండ్ చేయాలని, అలాంటి ప్రజా సమస్యలపై చర్చ జరగాలని అన్నారు.

# నరేంద్ర మోడీ... భారత బైడెన్: రాహుల్ రచ్చ



న్యూఢిల్లీ,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ రాజకీయ రచ్చకు తెరదీశారు. మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచా రంలో రోజుకొక వివాదాస్పద అంశం తెరమీదికివస్తోంది. దీనిలో ఎవరూ తక్కువ కాదు. ఎవరూ తక్కువ తినలేదు. అటు బీజేపీ కూటమి, ఇటు కాంగ్రెస్ కూటములు రెండూ కూడా హెూరా హెూరీ తలపడుతున్న నేపథ్యంలో రాజకీయ రచ్చ రూపాంతరం చెందు తూ వివాదాలను మరింత పెంచి పోషిస్తుండడం గమనార్హం. రెండురోజుల కిందట... హిందువులు ఐక్యంగా లేకపోతే.. విభజన జరుగుతుందంటూ.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పటికీ చల్లారలేదు.సీఎం యోగిపై సొంత పార్టీ బీజేపీ నేతలే విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలే తెరమీదికి వస్తున్నాయి. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే.. ముస్లింలను తరిమేస్తారంటూ.. ఆ పార్టీ నాయకులు యాగీ చేస్తున్నారు. ఇక, ఎంఐఎం పార్టీపై బీజేపీ అనుకూల వ్యక్తులు నిప్పులు చెరుగు తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలా.. అటు ఇటు రెండు పక్షాలు కూడా.. చలికాలంలో మహారాష్ట్ర ఎన్నికల క్రతువును నిప్పుల కొలిమిలా మార్చేశాయి. రాజకీయ సెగలు పుట్టిస్తున్నాయి.ఇక, ఇప్పుడు తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి, బీజేపీ అగ్రనాయకుడు నరేంద్ర మోడీని ఉద్దేశించి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాఅధ్యక్షుడుగా ఉన్న జో బైడెన్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని పోలుస్తూ.. తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి ఇప్పటి వరకు బైడెన్‌తో ఎవరూ ఎవరినీ పోల్చలేదు. కానీ, తొలిసారి రాహుల్ గాంధీ మాత్రం మోడీని బైడెన్‌తో పోల్చడం వివాదానికి దారితీస్తోంది. అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్.. ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు జరిగిన చర్చల సందర్భంగా విమర్శలు ఎదుర్కొన్నారు.బైడెన్ మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీనికి కారణం.. ఆయన పలు సందర్భా ల్లో వ్యవహరించిన తీరు, చేసిన కామెంట్లే. ఉక్రెయిన్ అధ్యక్షుడు పుతిన్ అని.. అమెరికా ఎన్నికలు వచ్చే ఏడాది జరుగుతాయని ఇలా అనేక వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా తన ప్రసంగం సమయం అయిపోయిన తర్వాత.. కూడా మైకు వదలకుండా.. స్టేజీపైనే ఉండిపోయారు. దీంతో బైడెన్ మతిమరుపుతో ఇబ్బంది పడుతున్నారన్న కామెంట్లు కురిశాయి. ఇక, ఇప్పుడు వీటిని మోడీకి అన్వయించిన రాహుల్ గాంధీ.. భారత బైడెన్ మోడీయేనని వ్యాఖ్యానించారు. ఈయన కూడా మతిమరుపు వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు.గతంలో తాను చెప్పిన విషయాలే ఇప్పుడు మోడీ ప్రస్తావిస్తున్నారని.. వ్యాఖ్యానించారు. కుల గణన, రిజర్వేషన్ల అంశాలపై గతంలో తాను చెప్పిన విషయాలు ఏవీ మోడీకి గుర్తులేవని.. అందుకే వాటిని కొత్తవాటిగా కలరింగ్ ఇస్తూ.. మళ్లీ ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లు ఉండాలని నేను అన్నాను. కానీ, మోడీ మాత్రం నన్ను రిజర్వేషన్లకు వ్యతిరేకం అంటున్నాడు. నేను కుల గణనకు అనుకూలంగా ఉన్నాను. కానీ, రేపు మోడీ దీనికి కూడా నేను వ్యతిరేకం అని చెప్పే అవకాశం ఉంది. మోడీ.. భారత్ బైడెన్‌లా వ్యవహరిస్తున్నారు అని రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

# పవన్ జీ కంటెంట్ చూడండి !



అమరావతి,జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన ధాటీగా ప్రసంగాలు చేస్తున్నారు. ఆయన స్పీచ్ అక్కడ అందరికీ ఆకట్టుకుంటోంది. ఒక విధంగా చెప్పాలీ అంటే జోరు చేస్తున్నారు.అయితే పవన్ కళ్యాణ్ తన స్పీచ్ లో కంటెంట్ ని కూడా జాగ్రత్తగా చూసుకోవాలని అంటున్నారు. ఆయన సనాతన ధర్మం అని ఒకసారి అంటున్నారు. అదే టైం లో మరోసారి ఇంకో మాట మాట్లాడుతూ తన కంటెంట్ తో కాస్తా కన్ ఫ్యూజ్ చేస్తున్నారు అని అంటున్నారు.ఆయన మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సనాతన ధర్మం గురించి మాట్లాడుతూనే మరో వైపు భోకార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మీద విమర్శలు చేస్తూ కులం పేరుతో కాంగ్రెస్ దేశాన్ని విభజిస్తోందని కామెంట్స్ చేశారు. కులం రిజర్వేషన్ల పేరుతో దేశాన్ని కాంగ్రెస్ విడగొట్టాలని చూస్తోంది అని పవన్ కళ్యాణ్ అన్నారు.ఇక దేశాన్ని ఏకత్రాటి మీద తీసుకుని రాగల సత్తా ప్రధాని నరేంద్ర మోడీకి మాత్రమే ఉందని పవన్ చెప్పారు. భారత్ లో హిందూ ముస్లిం క్రిస్టియన్ అన్న భేద భావం లేదని కూడా ఆయన అన్నారు. దానికి ఉదాహరణలను చూపిస్తూ అమీర్ ఖాన్ సల్మాన్ ఖాన్, షారూక్ ఖాన్లు భారత్ లో సూపర్ స్టార్లుగా ఉన్నారని గుర్తు చేశారు.అలాగే అబ్దుల్ కలాం ని గుండెల్లో పెట్టుకున్న దేశం భారత్ అన్నారు. అటువంటి భారత్ కి కులం పేరుతో రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ విడగొట్టాలని చూస్తోంది అని అన్నారు. అయితే సనాతన ధర్మం అంటూ పవన్ చెబుతున్న దాంట్లోనే కులాల ప్రస్తావన ఉంటుందని అంటున్న వారూ ఉన్నారు.సనాతన ధర్మం దేశాన్ని వెనక్కి తీసుకుని వెళ్తుందని పాత విధానాల వల్ల దేశం ఇబ్బంది పడుతుందని కూడా వామపక్షాలతో పాటు ఇతర నాయకులు అంటూంటారు. మరి పవన్ సనాతన ధర్మం గురించి ఒక వైపు చెబుతూ కాంగ్రెస్ కులాల పేరుతో చీలుస్తుందని చెప్పడం పట్ల మాత్రం చర్చ సాగుతోంది.పవన్ ని ఏమైనా అంటే అభిమానులు ఆయన జన సైనికులు బాధపడతారు కానీ ఆయన తన కంటెంట్ విషయంలో మరింత జాగ్రత్తగా చూసుకోవాలి కదా అని అంటున్న వారూ ఉన్నారు. నిజానికి సనాతన ధర్మమే కులాలకు మూలంగా మారిందని మేధావుల నుంచి అంటున్న మాట. ఆ భావజాలం వల్ల దేశంలో మళ్ళీ వర్ణ వ్యవస్థ మరింత బలోపేతం అయితే అది దేశానికి ఇబ్బందిగా ఉంటుందని కూడా అంటారు.ఇక కాంగ్రెస్ కులాలను విడదీస్తోందని పవన్ చెప్పడం పట్ల కూడా విమర్శలు ఉన్నాయి. ఈ దేశంలో రిజర్వేషన్లు ఉన్నాయి. కులాలూ ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఆయా కులాలకు దక్కాలని కాంగ్రెస్ అంటోందని చెబుతున్నారు. ఇందులో చీల్చడం అన్న ప్రస్తావన ఎందుకు వస్తుందని ప్రశ్నిస్తున్నారు.ఏది ఏమైనా కుల రహిత సమాజం అంటే అది అభ్యుదయం లాంటిదే అలాంటి దాని కోసం అంతా కృషి చేయాల్సిందే అని మేధావులతో పాటు అందరి మాటగా ఉంటుంది. కానీ సనాతన ధర్మంలో అది సాధ్యపడుతుందా లేదా అన్నది కూడా చూడాలని అంటున్నారు. ఏది ఏమైనా పవన్ కళ్యాణ్ ఇండియా కూటమి నేతలను ధాటీగా విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ విధానలను కూడా ఆయన తప్పు పడుతున్నారు.అదే సమయంలో ఆయన కాంగ్రెస్ దేశాన్ని చీలుస్తోంది అని చేస్తున్న విమర్శల మీదనే చర్చ సాగుతోంది. మరో వైపు చూస్తే ఈ దేశంలో అన్ని మతాలకు తగిన గౌరవం మర్యాద ఇస్తున్నారు అన్నది అంతా అంగీకరించాల్సిందే అని పవన్ ఆ విషయంలో బాగానే చెప్పారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే మహారాష్ట్రలో పవన్ స్పీచ్ లో చాలా అంశాలను టచ్ చేసారు. అవి జనాలకు ఎంత మేర ఆకట్టుకుంటాయన్నది చూడాల్సిందే అని అంటున్నారు.

## ఢిల్లీలో తీవ్రమవుతున్న కాలుష్యం

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుతున్నది. గాలిలో తేమ పెరిగినా కొద్ది కాలుష్యం తీవ్రమవుతున్నది. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300 దాటింది. భజన్‌పురా ఏరియాలో ఉదయం 10 గంటలైనా మంచుకప్పుకుని చీకటి చీకటిగానే ఉంది.

# ఏపీ అసెంబ్లీలో ఇలా జరిగితే.. జగన్ సభ్యత్వం రద్దే!



అమరావతి,ప్రస్తుతం ఏపీలో హాట్ టాపిక్‌గా మారిన విషయం.. వైసీపీ అదినేత, మాజీ సీఎం జగన్ సభలకు గైర్హాజరు అవుతుండడమే. ఇప్పటికి రెండు సార్లు సభలు జరిగాయి. ప్రస్తుతం జరుగుతున్నది మూడో సభ.. పైగా బడ్జెట్ సమావేశాలు. తొలి సభకు వచ్చిన జగన్ ఆయన 10 మంది ఎమ్మెల్యేలు.. ప్రమాణ స్వీకారం చేసి చక్కా వెళ్లిపోయారు. రెండోసారి జూలైలో జరిగిన సభలకు.. వచ్చి గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలి రగడ చేసి.. రచ్చ సృష్టించి వెళ్లిపోయారు. ఇక, ఇప్పుడు మూడోసారి సభలు జరుగుతున్నాయి. అయితే.. ఈ సభలకు అసలు హాజరే కావడం లేదు. పైగా రాబోమని చెప్పేశారు.దీంతో జగన్ చుట్టూ విమర్శలు.. వివాదాలు జరుగుతున్నాయి. ఆయన రాజీనామా చేయాలని.. సభలకు వెళ్లనప్పుడు పదవులు ఎందుకని ఆయన సోదరి షర్మిల కూడా నిప్పులు చెరుగుతున్నారు. ఇక, రాజకీయ పక్షాలు.. అనుకూల మీడియా సైతం.. జగన్‌ను తప్పుబడుతూనే ఉన్నాయి. అయినా.. జగన్‌లో ఎక్కడా మార్పు రావడం లేదు. మరోవైపు.. రోజూ అసెంబ్లీలో జగన్ ప్రస్తావన వస్తూనే ఉంది. జగన్ సభకు రావాలని కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సూచిస్తున్నారు. ఇవన్నీ జగన్‌కు తెలిసి కూడా ఆయన మౌనంగా ఉన్నారు. మీడియా సమావేశాలకు మాత్రమే పరిమితం అయ్యారు.అయితే..ఇప్పుడు ఒక సంచలన వ్యవహారం తెరమీదికి తెరమీదికి వచ్చింది. మాజీ ఐపీఎస్ ఉమేష్‌చంద్ర పీవీజీ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో దుమ్ము రేపుతోంది. ఇది .. అసెంబ్లీవ్యవహారాలకు సంబంధించిన భారత రాజ్యాంగం ప్రస్తావించిన కీలక విషయం. రాజ్యాంగంలో అసెంబ్లీ, పార్లమెంటు అంశాలకు సంబంధించి.. అనేక ఆర్టికల్స్ ఉన్నాయి. అవి సభ్యులు.. పార్టీలు ఎలా వ్యవహరించాలన్న విషయాలను సూత్రీకరించాయి. అదేవిధంగా చెప్పినట్టు చేయకపోతే.. ఏం చేయాలో కూడా దిశానిర్దేశం చేశాయి. దీనిని బట్టి.. సభలకు రాని సభ్యులు తమ సభ్యత్వాన్ని ఆటోమేటిక్‌గా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయాన్ని ఉమేష్ చంద్ర స్పష్టం చేశారు.

### ఆర్టికల్ 190

రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 సభ్యులు, సభలకు రావాల్సిన విధానాలను స్పష్టం చేసింది. దీనిలో మొత్తం 4 క్లాజులు ఉన్నాయి. వీటిలోనూ ప్రధానంగా 3(ఏ), 3(బీ) అత్యంత కీలకంగా ఉన్నాయి. వరుసగా ఎవరైనా సభ్యుడు కనుక 60 రోజుల పాటు సభలకు హాజరు కాకపోతే.. సదరు సభ్యుడి సభ్యత్వం(ఎమ్మెల్యే) ఆటోమేటిక్‌గా ఖాళీ అవుతుందని(రద్దు) ఈ ఆర్టికల్ కుండబద్దలు కొడుతోంది. ఇదే విషయాన్ని ఉమేష్ చంద్ర ప్రస్తావిస్తూ.. జగన్ పేరును ఉటంకించారు. జగన్ కనుక 60 రోజుల పాటు సభలకు వెళ్లకపోతే ఆయన సభ్యత్వం రద్దవుతుందన్నది(ఆయనేకాదు.. ఎవరైనా సరే) ఈ ఆర్టికల్ సారాంశంగా పేర్కొన్నారు.

### ఇలా జరిగినప్పుడే!!

మన రాజ్యాంగం చిత్రమైంది. ఇదే 190 ఆర్టికల్ 4వ క్లాజులో మరో ప్రస్తావన కూడా ఉంది. ఏదైనా సభ వరుసగా 60 రోజుల పాటు నిర్విరామంగా జరిగినప్పుడు మాత్రమే.. సభకు హాజరు కాని సభ్యుల సభ్యత్వం రద్దవుతుందని పేర్కొన్నారు. అంటే.. అసెంబ్లీ వరుసగా 60 రోజులు కార్యక్రమాలు జరుపుకోవాలి. అంతేకాదు.. ఈ 60 రోజుల వ్యవధిలో వరుసగా నాలుగు రోజులు సెలవు ఇచ్చినా.. మధ్యలోనే ప్రోరోగ్ చేసినా.. ఆర్టికల్ 190లోని 3 క్లాజ్ సభ్యులకు వర్తించదు. కాబట్టి.. ఉమేష్ చంద్ర చెప్పింది.. రాజ్యాంగంలో ఉన్నది కరెక్టే అయినా.. అదే రాజ్యాంగంలో ఉన్న క్లాజ్ 4 ఆఫ్ 190 అమలైనప్పుడు మాత్రమే జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుంది. లేకపోతే..అప్పటి వరకు ఎలా ఆడుకున్నా రక్షణ ఉన్నట్టే!!

# బీఆర్ఎస్ కు షాకిచ్చిన మాజీ ఎమ్మెల్యే..



హైదరాబాద్,ఆయన ఒక మాజీ ఎమ్మెల్యే. నమ్మిన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడిచే నాయకుడు. అటువంటి నాయకుడు ఒక్కసారిగా పార్టీపై తిరుగుబావుటా ఎగురవేశారు. తనకు సరియైన గు ర్తింపు ఇవ్వడం లేదంటూనే, పార్టీ జిల్లా అధ్యక్షుడిపై రుసరుసలాడారు. ఆయనెవరో కాదు బీఆర్ఎస్ కు చెందిన అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు.ఈ సందర్భంగా తాను ఎదుర్కొంటున్న అవమానాలపై మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గళమెత్తారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి వీర విధేయుడుగా ఉన్న తన పట్ల, పార్టీ నాయకత్వం పట్టించుకోని తీరులో వ్యవహరిస్తుందన్నారు. బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు లు తమ వైఖరి మార్చుకోకుంటే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందంటూ ఆయన ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో జరిగే ఏ కార్యక్రమానికి కూడా తనకు కనీసం సమాచారం ఇవ్వడం లేదంటూ తాటి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సముచిత గౌరవం లేకుంటే పార్టీలో కొనసాగడం ఇక కష్టమంటూ ఆయన హెచ్చరించడం విశేషం.మాజీ ఎమ్మెల్యే గా ఉన్న తనను పిలవకుండా పార్టీ నాయకత్వం, కార్యకర్తలకు సమాచారం అందించి క్షేత్రస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబన్నారు. తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించానని, నాగేశ్వరరావు ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి అంతా శూన్యమని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విమర్శించారు. కేవలం తాను ప్రచారం చేయడం వల్లే నాగేశ్వరరావుకు గత ఎన్నికల్లో డిపాజిట్లు వచ్చాయని, అటువంటి తనను ప్రస్తుతం పక్కన పెట్టడం దేనికి సంకేతమన్నారు.పార్టీని నమ్ముకొని ఉన్న క్యాడర్ ను కాపాడుకోవడంలో జిల్లా బీఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా విఫలమైందని, ఈ సంస్కృతి ఇలాగే కొనసాగితే తాను సైతం పార్టీలో కొనసాగడం కష్టమంటూ ఫైర్ అయ్యారు. పార్టీని నమ్ముకొని ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యే ఏకంగా తనకు సముచిత స్థానం లేదంటూ ప్రకటించి, పార్టీలో కొనసాగలేనడం బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ప్రస్తుత స్థితిగతులకు నిలువుటద్దమంటూ రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు. కాగా ఈ విషయంపై బీఆర్ఎస్ అధిష్టానం స్పందించి మాజీ ఎమ్మెల్యే ను బుజ్జగిస్తుందా.. లేక సైలెంట్ గా జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

# బీజేపీకి ఎన్‌పీపీ మద్దతు ఉపసంహారణ !




మణిపూర్,మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో బీజేపీకి షాక్ తగిలింది. మణిపూర్ బీజేపీ ప్రభుత్వానికి నేషనల్ పీపుల్స్ పార్టీ మద్దతు ఉపసంహరించుకుంది. ఈ మేరకు ఎన్‌పిపి అధ్యక్షుడు, మేఘాలయ సిఎం కాన్రాడ్ కె. సంగ్మా ఉపసంహరణపై బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు లేఖ రాశారు.మణిపూర్‌లో శాంతిభద్రతల సంక్షోభాన్ని పరిష్కరించడంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో బీరేన్ సింగ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మణిపూర్‌లో హింస, అల్లర్లను అదుపు చేయలేక తక్షణమే మద్దతు ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు. మణిపూర్ అసెంబ్లీలో మొత్తం 60 సీట్లు ఉండగా 53 స్థానాలతో ఎన్డీయే అధికారంలో ఉంది. ఇందులో 'ఎన్?పీపీ'కి 7 సీట్లు ఉన్నాయి.

### మణిపూర్ హింసపై అమిత్ షా సమీక్ష !

కాగా, మణిపూర్ అల్లర్లపై కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా సమీక్ష నిర్వహించారు. ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన.. రాష్ట్రంలో శాంతిస్థాపనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహారాష్ట్రలో తన ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకుని ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే కేంద్ర మంత్రి ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# మత స్వేచ్ఛకు విఘాతం



న్యూఢిల్లీ : భారత్‌లో మానవ హక్కులు క్షీణిస్తున్నాయని అమెరికా కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ తాజా నివేదిక ఎండగట్టింది. కేంద్రంలో పది సంవత్సరాల పాటు సాగిన బీజేపీ పాలన, 2014 తర్వాత వివిధ రాష్ట్రాలలో బీజేపీ తన ప్రభుత్వాలను ఏర్పాటు చేసి ఉనికిని విస్తరించుకోవడం వంటి పరిణామాల కారణంగా దేశంలో హిందూ మతోన్మాదం పెచ్చరిల్లిందని తెలిపింది. ఇటీవలి సంవత్సరాలలో దేశంలో మతపరమైన హింసాకాండ పెరిగిపోయిందని, మత స్వేచ్ఛకు విఘాతం ఏర్పడిందని చెప్పింది. భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై అమెరికా శాసనకర్తలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఆందోళన వెలిబుచ్చారు. 'భారత్ : మత స్వేచ్ఛ అంశాలు' పేరిట రూపొందించిన ఈ నివేదికను ఈ వారం ప్రారంభంలో విడుదల చేశారు. పాలకులు అవలంబించిన రాజకీయ, మతపరమైన తప్పుడు వైఖరుల కారణంగా సామాజిక సామరస్యం దెబ్బతినుదని తెలిపారు. అంతర్జాతీయ చర్యలకు సంబంధించి కెనడా, అమెరికా ప్రాసిక్యూటర్లు ఇటీవల భారత ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను నివేదిక ప్రస్తావించింది. మానవ హక్కులకు సంబంధించి భారత్‌కు ఉన్న పేలవమైన రికార్డు దృష్ట్యా అమెరికా భాగస్వామిగా ఆ దేశ పాత్ర బలహీనపడవచ్చునని తెలిపింది. హిందూ జాతీయతావాద విధానం ద్వారా దేశంలో మతపరమైన మెజారిటీవాదాన్ని ముందుకు తెచ్చేందుకు అధికార బిజెపి ప్రయత్నిస్తోందని..చెబుతూ ఈ ధోరణి కొనసాగితే భారత్ తన విశ్వసనీయతను కోల్పోతుందని చెప్పింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com